క్లుప్తంగా

క్రైస్తవ ఉజ్జీవ సభలను జయప్రదం చేయండి

బేతంచెర్ల: డోన్ పట్టణంలో ఫిబ్రవరి 5, 6,7,8 తేదీలలో నిర్వహిస్తున్న క్రైస్తవ ఉజ్జీవ మహాసభలను జయప్రదం చేయాలని మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసన్న, సెక్రటరీ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఎల్ఈఎఫ్ చర్చిలో సభల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సభ్యులు జయరాజు, క్రిష్టఫర్, మల్లేష్, హెన్రీబాబు పాల్గొన్నారు.

సన్మానం



ఎస్ఐగా ఎంపికైన నిర్మలను సన్మానించిన కాలనీవాసులు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ శేషాద్రి, నాగలక్ష్మి దంపతుల మూడవ కుమార్తె నిర్మల సివిల్ ఎస్ఐగా ఎంపిక కావడంతో కాలనీవాసులు అభినందించారు. కాలనీవాసులు భాస్కర్, పాస్టర్ ప్రసాద్ సివిల్ నిర్మలను ఘనంగా సత్కరించారు. ప్రతి ఒక్కరు నిర్మలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యంతో చదవాలని వారు పిలుపునిచ్చారు.

నందివర్గం ఎస్ఐగా తిరుపాల్



బనగానపల్లె రూరల్ : నందివర్గం పోలీసు స్టేషన్ నూతన ఎస్ఐగా బుధవారం పి తిరుపాల్ బాధ్యతలను స్వీకరించారు. దొర్నిపాడు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తిరుపాల్‌ను నందివర్గం ఎస్ఐగా ను, ఇక్కడ రామాంజనేయరెడ్డిని ఉయ్యాలవాడ ఎస్ఐగా ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

జాతిపిత విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

డోన్ : జాతిపిత మహాత్మగాంధీ నూతన విగ్రహాన్ని స్థానిక పాతబస్టాండ్‌లో త్వరలో ఏర్పాటు చేస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన జాతిపిత విగ్రహ స్థానంలో ఏడు అడుగుల నూతన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచన మేరకు మున్సిపాలిటీ ముందుకు వచ్చిందన్నారు. రోడ్డు వెడల్పు కార్యక్రమం కూడా పూర్తయినందున అతిత్వరలోనే రూ.12లక్షలతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. చైర్మన్ వెంట మున్సిపల్ డీఈ రసూల్, ఏఈ సతీష్‌లు పాల్గొన్నారు.

నివాళి



నగదు అందిస్తున్న చల్లా రఘునాథ్ రెడ్డి

అవుకు: మేజర్ గ్రామపంచాయతీ అవుకు పారిశుద్ధ కార్మికుడు సాత్రి నరసింహులు అనారోగ్యంతో మృతి చెందాడు. ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి మంగళవారం మృతుని ఇంటివద్దకు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని భార్యకు తక్షణ సాయంగా ఆర్థిక సాయం అందజేశారు.

క్రైస్తవ ఉజ్జీవ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన

డోన్ : పట్టణంలో ఫిబ్రవరి నెల 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు నిర్వహించే క్రైస్తవ ఉజ్జీవ మహాసభల పోస్టర్లను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. బెల్లంపల్లి కల్వరి మినిస్ట్రీ ఆధ్వర్యంలో గుత్తి రోడ్డు కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే ఈ మహాసభలను విజయవంతం చేయాలని క్రైస్తవ సోదరులను ఈ సందర్భంగా మంత్రి కోరారు. కార్యక్రమంలో క్రిష్టియన్ యాక్షన్ కమిటీ స్టేట్ కోఆర్డినేటర్ ఎలిషాపాల్, రాయలసీమ కోఆర్డినేటర్ శేఖర్, క్రిష్టియన్ మతపెద్దలు నిత్యానందం, ఆదాం, ప్రవీణ్‌కుమార్, పాస్టర్లు సిస్టర్ శరుణ్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బేతంచెర్ల: మండలపరిధిలోని ఆర్ఎస్ రంగాపురం రైల్వే గేటు సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కొలుములపల్లె గ్రామానికి చెందిన నాగమద్ది రహిమానుపురం గ్రామంలో జరిగే పెద్దమ్మ దేవర ఉత్సవాలకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. రంగాపురం నుంచి బేతంచెర్ల వైపు ద్విచక్రవాహనం పైవస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు తాగిన మైకంలో ఢీ కొట్టి వెళ్లిపోయారు. ఈప్రమాదంలో నాగమద్దికి కాలు విరిగింది. అక్కడ నుంచి వస్తున్న వ్యక్తులు కారులో తీసుకొచ్చి ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



మహాలక్ష్మి హాస్పిటల్ వద్ద పార్కులో వాకర్లతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన,



ముస్లిం మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

- డోన్ పట్టణంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి బుగ్గన
- అభివృద్ధి పనుల పరిశీలన

డోన్ : మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో స్థానిక ప్రజలకు అవసరమైన మౌలక వసతుల అభివృద్ధి పనులు ఈ నెలాఖరులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంగళవారం డోన్ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. మహాలక్ష్మి ఆసుపత్రి వద్ద మున్సిపాలిటీ , గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు రూ.50లక్షలతో తీర్చిదిద్దుతున్న పార్కును మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో ఏర్పాటు చేసిన ట్రాక్‌పై ఆయన వాకర్లతో కలిసి వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా పార్కులో ఏర్పాటుకు అవసరమయ్యే వసతుల గురించి ఆయన వాకర్లను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడే ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, క్యాంటీన్ భవనాల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ నెలఖారులోపు అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులకు అధిష్టానం పంపిన ఐడి కార్డులను మంత్రి బుగ్గన సోషల్‌మీడియా కన్వీనర్ దినేష్‌గౌడ్ ద్వారా కార్యకర్తలకు స్వగృహంలో పంపిణీ చేశారు.

ముస్లిం మైనార్టీలతో సమావేశం

పట్టణంలో అత్యధికంగా ఉన్న ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి నాయకులతో మంత్రి బుగ్గన తన స్వగృహంలో మంగళవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. మౌజన్లకు ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనం, మసీదులకు కావాల్సిన సౌకర్యాల గురించి ఆయన ఆరాతీశారు. సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి ముస్లిం పెద్దలకు హామీ ఇచ్చారు. సమావేశంలో పట్టణంలోని తొమ్మిది మసీదులకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.



పార్కు వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి బుగ్గన

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీవాసులతో చర్చిస్తున్న మంత్రి బుగ్గన తనయుడు అర్జున్ రెడ్డి

బేతంచెర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి దక్కిందని మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గూటుపల్లెలో జరుగుతున్న చెర్వు అభివృద్ధి పనులను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ, మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్లు ముర్తుజావలి, ఖాజహుసేన్, గ్రామ సర్పంచ్ శ్రీరాములతో కలిసి అర్జున్ రెడ్డి పరిశీలించారు. గ్రామంలోని ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి, సంక్షేమ పథకాలు అందుతున్నాయా, సమస్యలు ఎమైనా ఉన్నాయాని అడిగి తెలుసుకున్నారు. ముందుగా గ్రామంలోని పెద్ద రాజు స్వామి దర్గా, రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీల్లో అర్జున్ రెడ్డి పర్యటించారు. వృద్ధులు, కాలనీవాసులు, మహిళలకు అభివాదం చేస్తూ వైస్సార్ చేయూత, ఆసరా పథకాలు అందుతున్నాయా.. వలంటీర్లు నెల నెల ఇంటి దగ్గరకు వచ్చి పింఛను ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, గూని నాగరాజు, నాగేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట స్వామి, బళ్లాని సూర్య, మధు సూధన్‌రెడ్డి, వలి బాషా, మండల, పట్టణ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, ఖాజా, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రంగస్వామి పాల్గొన్నారు.

విజేత ప్రకాశం జిల్లా వృషభాలు



వృషభాల యాజమానికి నగదు అందజేస్తున్న దాతలు

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తకోటలో మంగళవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో న్యూక్యాటగిరి ఎద్దులకు బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను సినీ నిర్మాత మహేష్‌ఖన్నా, మండల వ్యవసాయ సలహ మండలి చైర్మన్ చంద్రన్నయాదవ్ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా, గంగన్న పాలెం గ్రామానికి చెందిన యూఎస్ఆర్ బుల్స్ ప్రథమ స్థానంలో నిలిచి రూ.50వేలను కైవసం చేసుకున్నాయి. తరువాత స్థానాలలో కర్నూలు జిల్లా , పుచ్చకాలయవాడ గ్రామానికి చెందిన ధనుంజయ వృషభాలు రూ.35వేలు, కర్నూలు జిల్లా, పగిడ్యాల గ్రామానికి చెందిన కోరల గిరిజ వృషభాలు రూ.25వేలు, నంద్యాల జిల్లా, కొచ్చెర్వు గ్రామానికి చెందిన లక్ష్మిదేవమ్మ వృషభాలు రూ.15వేలు, అనంతపురం జిల్లా, కోమలి గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి వృషభాలు రూ.10వేలు గెలుచుకున్నాయి. అదేవిధంగా కర్నూలు జిల్లా , పెండేకల్ గ్రామానికి చెందిన నాగభూణం వృషభాలు రూ.8వేలు, అనంతపురం జిల్లా, పెద్దవడుగూరు గ్రామానికి చెందిన ప్రసాద్ వృషభాలు రూ.6వేలు, కర్నూలు జిల్లా, పులికొండ గ్రామానికి చెందిన రాముడు వృషభాలు రూ.5వేలను కైవసం చేసుకున్నాయి.

ఆసుపత్రి భవనం ముస్తాబు

- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: పట్టణంలో రూ. 3.80 కోట్లతో నిర్మించిన 30 పడకల ఆసుపత్రి భవనం ప్రారంభానికి ముస్తాబైంది. బుధవారం బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. నాడు- నేడు కార్యక్రమం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని హంగులతో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు కొత్త భవనాన్ని నిర్మించింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు.



ప్రారంభానికి ముస్తాబైన 30 పడకల ఆసుపత్రి భవనం

నేడు అభివృద్ధి పనులు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని



నూతనంగా నిర్మించిన కనెక్టింగ్ బ్లాక్

అవుకు: మండల కేంద్రం అవుకు సీహెచ్‌లో రూ.2.43 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు ఆపరేషన్ థియేటర్‌లు, కనెక్టింగ్ బ్లాక్, రెండు డెలివరీ రూమ్‌లు, పోస్టుమార్టం రూమ్, పేషెంట్స్ అటెండర్స్ రూమ్, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూమ్, అంబులెన్స్ షెడ్, జనరేటర్ షెడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. అదేవిధంగా ఆక్సిజన్ ప్లాంట్, నీటి సంప్‌లు, ఆసుపత్రి ప్రాంగణంలో సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్నారు.

అంకిరెడ్డిపల్లెలో గడ్డివాములు దగ్ధం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో మంగళవారం రాత్రి గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన బత్తుల రామచంద్రుడు శివాలయం వెళ్లే దారిలో పశువుల మేత కోసం ఇటీవలనే తొమ్మిది ట్రాక్టర్ల గడ్డి కొనుగోలు చేసి కల్లంలో గడ్డివాములు నిల్వ చేసుకున్నాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగి గడ్డివాములకు మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా వీలుపడక పోవడంతో ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేసినా అప్పటికే గడ్డివాములు కాలిపోయాయి. ప్రమాదవశాత్తు ప్రమాదం చోటు చేసుకుందా లేదా అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. గడ్డివాముల విలువ రూ.1.60 లక్షలు ఉంటుందని బాధితుడు రామచంద్రుడు వాపోయారు.

కార్పెంటర్లు ఐకమత్యంగా ఉండాలి

కోవెలకుంట్ల: కార్పెంటర్లు ఐకమత్యంగా ఉండాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్పెంటర్లు నియమ నిబంధల ప్రకారం కులవృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు రమణ, రాజేశ్వరాచారి, దామోదర ఆచారి, నాగ ప్రసాద్, ఉపాధ్యక్షుడు షేక్‌వలి, కార్యదర్శి రమేష్ బాబు, ఉప కార్యదర్శి దస్తగిరి, కోశాధికారి సుబ్రహ్మణ్య ఆచారి, సభ్యులు రాముడు, ఉదయ్‌కుమార్, ప్రసాద్, బ్రహ్మయ్య, కరిముల్లా, మునీర్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల భద్రతే ధ్యేయం

డోన్ టౌన్ : ఆర్టీసీ ప్రయాణిల భద్రతే సంస్థ ప్రధాన ధ్యేయమని డోన్ డిపో మేనేజర్ శశిభూషన్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక గ్యారేజ్‌లో సోమవారం కార్మికుల సమావేశం నిర్వహించారు. ముందుగా బేతంచెర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గంగుల నాగరాజు డ్రైవర్లకు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందికి రోడ్డు ప్రమాదాల నివారణకు సూచనలు ఇచ్చారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ సుఖప్రదమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని తెలిపారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి

డోన్ టౌన్ : స్థానిక కొత్త బస్టాండ్‌లో ఉన్న శ్రీవరసిద్ధి వినాయక గుడి తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం డిపో మేనేజర్ శశిభూషణ్‌కు మంగళవారం విశ్వ హిందు పరిషత్ జిల్లా సత్సంగ్ ప్రముఖ్ శ్రీరామ్, కార్యదర్శి రామా రాజేష్ వినతి పత్రం అందజేశారు. డిపో ఏర్పాటు సమయంలో ఈ గుడిని నిర్మించారని వారు డీఎంకు తెలిపారు. ఇటీవల సంస్థ ఖాళీ స్థలాన్ని ఆర్టీసీ లీజుకు ఇచ్చిందన్నారు. అక్కడ నిర్మిస్తున్న కల్యాణ మండపం కోసం గుత్తేదారు ఆలయం నిర్మాణం తొలగిస్తున్నారని, నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయాలని వారు డీఎంను కోరారు.

శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం

డోన్ టౌన్ : మూఢ నమ్మకాలను పారద్రోలి శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దామని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవధ్యక్షుడు నరసింహులు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. స్థానిక కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో మంగళవారం డోన్ డివిజన్ అధ్యక్షుడు సర్వజ్ఞమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జన విజ్ఞాన వేదిక నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు లతీఫ్, నాయకులు రామమూర్తి, బాబు, సుబ్బరాయుడు, గోపాల్, చంద్రమోహన్, సంజీవరెడ్డి, సంజీవరాయుడు, శాంతికుమార్, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

డోన్ టౌన్ : పట్టణంలోని నల్లగుట్ట ప్రాంతంలో నాటుసారా విక్రయిస్తున్న శ్రీరాంనగర్‌కు చెందిన ఈడిగ రాముడును అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. అతని నుంచి 10లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

నేటి నాలుగు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని మల్యాల విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి గుండాల గ్రామం వరకు జరుగుతున్న 33 కేవీ లైన్ పనుల కారణంగా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని యాపదిన్నె ఫీడర్ కింద ఉన్న యాపదిన్నె, చనుగొండ్ల, తాడూరు, బి,రామదుర్గం గ్రామాలకు నాలుగు రోజుల పాటు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6గంటల వరకు కరెంటు ఉండదన్నారు. వ్యవసాయానికి తెల్లవారు జామున 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి రాత్రి 9గంటల తరువాత విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం





అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని,జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎస్సీ కమ్యూనిటిభవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే , జెడ్పీ చైర్మన్

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె రూరల్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైస్సార్‌సీపీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యనిస్తుందని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగనన్న పెద్దపీట వేశారని, వారిని అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తూ అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని భానుముక్కల ఎస్సీ కాలనీలో రూ.10లక్షలతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనం, రూ.25లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని ఎమ్మెల్యే కాటసాని, ఆయన సతీమణి కాటసాని జయమ్మ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముందుగా ప్రజలను ఉద్దేశించి జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. జిల్లాలో డోన్ నియోజకవర్గం తర్వాత ఎక్కువ శాతం బనగానపల్లె నియోజకవర్గంలోనే అభివృద్ధి పనులు ఎమ్మెల్యే కాటసాని ఆధ్వర్యంలో జరిగాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పట్టాల పంపిణీ జరిగిందని, బనగాలనపల్లెలో మాత్రం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి కారణంగా నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ నాయకుడైన పేదలకు మంచి జరిగితే సహకరించాలని ఇందుకు విరుద్దంగా మాజీ ఎమ్మెల్యే బీసీ వ్యవహరించడం బాధాకరమని, పేదల ఉసురు ఆయనకు తలుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బీసీ ఎన్నికుట్రల పన్నినా చివరకు న్యాయమే గెలుస్తోందని, త్వరలోనే కోర్టులో సమస్య పరిష్కారమవుతుందని... పట్టణ పేదలందరికీ జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు.

సెల్ఫీ నాయకుడు... బీసీ జనార్ధన్‌రెడ్డి

టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సెల్ఫీ నాయకులుగా మారారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎద్దేవా చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి జరుగుతున్నా.. మాజీ ఎమ్మెల్యే బీసీకి కనిపించడం లేదన్నారు. రూ.22 కోట్లతో ఏరియా ప్రభుత్వ వైద్యశాల, రూ. కోట్లు వెచ్చించి బనగానపల్లె, కోవెలకుంట్లలో ఫోర్‌స్లైన్స్ సెంట్రల్ లైటింగ్ పనులు, ఎంపీడీఓ కార్యాలయం, గ్రామ సచివాలయాలు, పీహెచ్‌సీలు తదితర నిర్మాణాలు జరిగినా ఆయనకు మాత్రం కనిపించవన్నారు. ఎక్కడో ఒక చోట చిన్న రోడ్డుపై గుంత పడితే అక్కడ సెల్ఫీదిగి.... తనను, ప్రభుత్వాన్ని విమర్శించడం సిగు చేటన్నారు. బనగానపల్లెలో పేదల పట్టాల పంపిణీని అడ్డుకున్న బీసీకి గుణపాఠం చెప్పాలని, శాశ్వతంగా రాజకీయాలకు దూరం చేయాలని కాటసాని ప్రజలకు పిలుపునిచ్చారు. గత ఎన్నిక ప్రచారంలో భాగంగా ఎస్సీకాలనీ వాలసులకు ఇచ్చిన హామీ మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మించామని గుర్తు చేశారు. కమ్యూటినిటీ హాల్‌కు అవసరమైన వంటసామాగ్రితో పాటు ఫర్నీచర్‌కు తనతో పాటు సోదరుడు కాటసాని ప్రసాదరెడ్డి ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, యువనేత కాటసాని ఓబులరెడ్డి, ఎంపీడీఓ శివరామయ్య, పీఆర్ డీఈఈ నాగశ్రీనివాసులు, ఏఈ గౌస్, ఈఓ ఖాలీల్, జెడ్పీటీసీ లక్ష్మీసుబ్బమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ దీవెనమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, ఎంపీటీసీ సభ్యులు శ్రీవేణి, తహీర్,జి ఎస్సీ సెల్ విభాగం కార్యదర్శి ప్రసాద్, షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, న్ భానుముక్కలసహకారం సంఘం చైర్మన్ సీలిశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గెలిస్తే సొంత నిధులతో రెండు సెంట్ల స్థలం ఇస్తారా... అయితే ముందే ఇవ్వండి!

టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పట్టణంలో పర్యటిస్తూ ప్రజలను మభ్యపెడుతోందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే పేదలందరికీ రెండు సెంట్ల స్థలం సొంత నిధులతో కొనుగోలు చేసి ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని, ముందే పంపిణీ చేస్తే ప్రజలందరూ మీకే ఓటువేస్తారు కాదా..అని ఎద్దేవా చేశారు. సొంత నిధులు ఖర్చు చేసేప్పుడు పేదలకు ముందే ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి అందజేస్తే మంచిది కదా.. ఎన్నికల వరకు ఎందుకు వేచి చూడాలి... ఎవరిని మభ్యపెట్టేందకు అని నిలదీశారు. బనగానపట్టణంలోని పేదలందరికీ ఇళ్ల పట్టాల పంపిణీకి ఎమ్మెల్యే కాటసాని సర్వం సిద్ధం చేస్తే కోర్టు ద్వారా అడ్డుకున్న మీరు ఎన్నికలు సమీపిస్తుండగా ఇలాంటి మోసపూరిత వాగ్దానాలు తగవని సూచించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



యాగంటిలో శ్రీ ఉమామహేశ్వరుల గ్రామోత్సవం



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం



దోన్ జట్టుకు రూ.25వేల నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బేతంచెర్ల పారువేటలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు



విజేతలకు బహుమతుల ప్రధానం చేస్తున్న బ్రహ్మానంద ఆచారి

కోవెలకుంట్ల: మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని బీసీ జన సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రిటైర్డ్ ఎస్ఐ బాలాజీసింగ్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకుని సోమవారం పట్టణంలోని సీతారాం నగర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు షేక్ చాందిని, బాల వెంకటనాయుడు, షేక్ ఉసేఫ్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: సంక్రాంతి పండుగను పురష్కరించుకొని గ్రామాల్లో నిర్వహించిన ఆటలు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మంగళవారం చింతలాయిపల్లె గ్రామ పంచాయితీ పరిధిలోని నాలుగు గ్రామాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5వేలను అందజేశారు. 20 మంది క్రీడాకారులకు రూ.21 వేలు వెచ్చించి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అలాగే తుమ్మలపెంటలో పండుగ సందర్భంగా మహిళలకు కబడ్డీ,కుర్చీలాట నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన మహిళలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు కలమల శేషారెడ్డి చీరెలు, హాట్‌బాక్స్‌లు అందజేశారు.

డోన్: మండలంలోని దొరపల్లె గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు గొల్ల చిరంజీవి, సర్పంచ్ రాముడు ఆధ్వర్యంలో మంగళవారం క్రికెట్, వాలీబాల్ పోటీలను వాలీబాల్ పోటీలలో విజేతలైన ఉలిందకొండ, దొర పల్లె టీములకు రూ.15వేలు, రూ.10వేల చొప్పున వారు బహుమతులు అందజేశారు. అలాగే క్రికెట్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన డోన్ జట్టుకు రూ.25వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన దొరపల్లె జట్టుకు రూ.10వేల చొప్పున అందజేశారు

ప్యాపిలి: మండల ప్రజలు మూడు రోజులపాటు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇళ్ల ముంగిట మహిళలు అందమైన రంగవల్లులతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. మంగళవారం కనుమ వేడుకలను ప్రజలు ఘనంగా జరిగాయి.

బేతంచెర్ల: మండలంలో సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చెన్న కేశవస్వామిని ఆలయ మాజీ చైర్మన్ గుండా జగన్ మోహన్‌రావు, కమిటీ సభ్యులు గౌరి హుసేన్‌రెడ్డి, పుల్లారెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి గ్రామోత్సవంతో పాటు పారువేట ఉత్సవం నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు.

బనగానపల్లె : సంక్రాంతి సందర్భంగా మండలంలోని బీరవోలు గ్రామం ఎస్టీ కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో జేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బ్రహ్మనంద ఆచారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బ్రహ్మనంద ఆచారి బహుమతుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీమవరం భక్త మండలి అధ్యక్షులు శ్రీరాములు, రాజు,శ్రీరాములు పుల్లయ్య, ఏ రాజు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు ఆనందోత్సవాల మధ్య ప్రజలు సంతోషంగా గడిపారు. మండలంలోని యాగంటి శ్రీ ఉమామేశ్వరస్వామి ఆలయంలో ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం వైభవంగా జరిగింది. భానుముక్కలలో రైతు సంఘం ఆధ్వర్యంలో పారువేట ఉత్సవ ఉత్సాహంగా జరిగింది.

కను పండుగగా చెన్నకేశవస్వామి ఊరేగింపు

బేతంచెర్ల : మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న చెన్నకేశస్వామి ఊరేగింపు కనుల పండువగా సాగింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రతి ఏడాదిలాగే గ్రామస్తులు జరుపుకునే ఈ ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతుంటారు. ఉదయం స్వామివారికి అభిశేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామ సమీపంలో ఉన్న బావి వద్ద స్వామివారికి కలశస్థాపన చేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మేళాతాలల మధ్య గ్రామ పురవీధులగుండా భక్తులు శరీరంపై కొరడాలతో కొట్టుకుంటూ జై చెన్నకేశవ, గోవింద గోవింద అంటూ ఊరేగింపు నిర్వహించారు. ఈఉత్సవాల్లో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మధు తదితరులు పాల్గొన్నారు.